భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం : మంత్రి సీతక్క

సమ్మక్కకు మొక్కులు చెల్లిస్తున్న సీతక్క

తాడ్వాయి, ఫిబ్రవరి 13 : మేడారం మినీ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని మంత్రి సీతక్క అన్నారు. వన దేవతలను గురువారం మంత్రి దర్శించుకొని మాట్లాడారు. భక్తులు భారీగా తరలివస్తారనే అంచనాలతో తాగు నీరు, మరుగుదొడ్లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటికే ఆరు లక్షల మంది భక్తులు తల్లులను దర్శణం చేసుకున్నారని చెప్పారు. జాతర మరో రెండు రోజుల పాటు కొనసాగనున్నందున భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని మంత్రి అధికారులకు సూచించారు. ఆమె వెంట ఆదిలాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఆత్రం సక్కు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ ఉన్నారు.

తల్లులకు మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

ఐలాపూర్ జాతరకు పోటెత్తిన భక్తులు

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 13 : మండలంలోని ఐలాపూర్ సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుంటున్నారు. గురువారం గొంతెమ్మ గుట్ట నుంచి సమ్మక్కను మల్లెల వంశానికి చెందిన పూజారులు తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. అంతకు ముందే అడవి నుంచి ఉదయం కంకవనాన్ని తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. ఇదివరకే సారలమ్మ గద్దెపై కొలువై ఉండటంతో భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు సందర్శించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, పీహెచ్‌సీ వైద్యుడు అభినవ్, ఐటీడీఏ ప్రోగ్రాం మేనేజర్ మహేందర్ ఉన్నారు.

గట్టమ్మ వద్ద భక్తుల సందడి

ములుగురూరల్, ఫిబ్రవరి 13 : మేడారం మినీ జాతరకు వెళ్తున్న భక్తులు గురువారం గట్టమ్మ తల్లిని దర్శించుకున్నారు. జాతరకు వెళ్లే భక్తులు ముందుగా గట్టమ్మకు మొదటి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి పసుపు, కుంకుమ సమర్పించారు.

ఘనంగా సమ్మక్క, సారక్క జాతరలు

కాటారం, ఫిబ్రవరి 13 : మండలంలో సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మ జాతరలు గురువారం ఘనంగా జరిగాయి. శంకరాంపల్లి, విలాసాగర్, గంగారం, పోతుల్వాయి, దేవరాంపల్లి, వీరాపూర్, మేడిపల్లి, చింతకాని ప్రాంతాల్లో గద్దెల వద్ద తల్లులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఒడి బియ్యంతో పాటు కానుకలు సమర్పించారు. గంగారంలో నాగులమ్మ జాతర వైభవంగా సాగింది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు మొక్కులు సమర్పించారు.

లక్నవరం సందర్శన నిలిపివేత

గోవిందరావుపేట, ఫిబ్రవరి13 : మేడారం మినీ జాతర నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు ఆదివారం వరకు లక్నవరం సరస్సు సందర్శనను నిలిపివేశారు. సోమవారం నుంచి పర్యాటకులు యథావిధిగా సందర్శించవచ్చునని పేర్కొన్నారు.

విజిలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 13 : క్రమం తప్పకుండా విజిలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ కమిటీ అధికారులు, మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు నిర్వహిస్తూ నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అందుకు బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. కాటారం, భూపాలపల్లి డివిజన్లలో విజిలెన్స్ టీములు ఏర్పాటు చేయాలని, విజిలెన్స్ టీములు ప్రతి రెండు నెలలకు సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. రేషన్ దుకాణాల్లో నిత్యావసర వస్తువులు, సరఫరాను పర్యవేక్షణ చేసేందుకు టాస్క్‌ఫోర్స్ టీములు ఏర్పాటు చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యతలేని బియ్యాన్ని తిరస్కరించాలని, సామాన్లు భద్రపర్చే స్టోర్ రూము, వంట శాలలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, డీఆర్డీవో నరేశ్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, డీఈవో రాజేందర్, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు సునీత, శైలజ, ఎస్టీ గురుకుల పర్యవేక్షణ అధికారి జీవరత్నం, డీలర్ల సంఘం ప్రెసిడెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

భూపాలపల్లి డీపీవో నారాయణరావు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 13 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఆర్వో, సహాయ రిటర్నింగ్ అధికారుల విధులు చాలా కీలకమని, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని డీపీవో నారాయణరావు అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో భూపాలపల్లి, కాటారం డివిజన్ల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, మాస్టర్ ట్రైనర్లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విధులను వివరించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటిస్తూ ఆర్‌వోలు నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి రోజు వారి రిపోర్టు పంపించాలని స్పష్టంచేశారు. వెబ్‌సైట్‌లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో విత్ డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయించాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో కేంద్రంలో జరిగే ప్రతి అంశాన్ని ఆర్‌వో డైరీలో రాయాలని సూచించారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న లక్ష్మీనర్సింహారావు

నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 13 : మండలకేంద్రంలో నిరుపేద విద్యార్థులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, హన్మకొండ రోటరీ క్లబ్ సభ్యుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు సైకిళ్లను పంపిణీ చేశారు. పాఠశాల దూరంగా ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లుగా తెలుసుకుని వీటిని అందజేసినట్లు ఆయన చెప్పారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత రంగాల్లో రాణించాలని కోరారు. విద్యార్థులు కట్ల భార్గవి, ఎర్రల అలేఖ్య, కొమిరెశెట్టి పూర్ణసాయి, సుహాన, రామదాసు నాగలక్ష్మి, లొటపెట్టల లహరికి సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ కబ్ సభ్యులు కాకులమర్రి ప్రదీప్‌రావు, ప్రవీణ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పోరిక గోవింద్ నాయక్, గడదాసు సునీల్‌కుమార్, ఖాజా పాషా, తాడూరి రఘు, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజారావు, కన్నె బోయిన రాజు, గండపెల్లి నర్సయ్య, దేపాక శ్రీరామ్, గద్దల శ్రీరాములు, ఖలీల్, సారయ్య, అంజన్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా జాతర

గోవిందరాజులను గద్దెలపైకి తీసుకెళ్తున్న పూజారులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 13 : కొండాయిలో అంగరంగ వైభవంగా దేవర గుట్ట నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గురవారం రాత్రి గద్దెలపై కొలువు దీరారు. దొడ్ల నుంచి సారలమ్మ కొండాయిలోని గద్దెలపై బుధవారం రాత్రికొలువు దీరింది. కాగా, పూజారులు, భక్తులు ఉదయం అడవి నుంచి వనం (కంకవనం)తీసుకవచ్చి గద్దెపై ప్రతిష్టించారు. సాయంత్రం కొండాయికి మూడు కిలో మీటర్ల దూరంలోని అడవిలో ఉన్న దేవర గుట్టకు పూజారులు దబ్బగట్ల జనార్దన్, రాజారాం, వడ్డెలు స్వామి, విష్ణులు వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేపట్టారు. మేడారంలో చిలకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకవచ్చే క్రమంలో భక్తులు ఎదురు చూసే విధంగా ఇక్కడ కూడా దేవర గుట్ట నుంచి గోవింద రాజులు, నాగులమ్మలను తీసువచ్చే దృశ్యాలకు ప్రాధాన్యత ఇస్తుంటారు. ఆలయానికి చేరుకున్న గోవిందరాజులు, నాగులమ్మలను రాత్రి పూజారులు, భక్తులు పొలిమేరలో ఉన్న గద్దెలపైకి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్టించారు. రాత్రి అడవిలో విడిది చేసి మొక్కులు చెల్లించారు. అలాగే మండల కేంద్రంలోని ఓడవాడలో సమ్మక్క, సారలమ్మ జాతరను నిర్వహించారు. ఉదయం అడవి నుంచి వనం తెచ్చి ప్రతిష్టించారు. గురువారం రాత్రి సమ్మక్క-సారలమ్మను గద్దెలపై ప్రతిష్టించారు. కార్యక్రమంలో పూజారులు వరలక్ష్మి, అనసూయ, రంగయ్య పాల్గొన్నారు.

పుట్టింట గద్దెకు చేరిన సమ్మక్క

తాడ్వాయి, ఫిబ్రవరి 13 : బయ్యక్కపేటలో చందా వంశీయుల ఆడబిడ్డ సమ్మక్క దేవత గద్దెపైకి చేరుకుంది. గురువారం ఇంటి ఆడబిడ్డలు సమ్మక్క పూజా మందిరంలో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి తల్లిని తీసుకువచ్చేందుకు అలుకుపూతలు, దూప దీప నైవేద్యాలను సమర్పించారు. డోలు వాయిద్యాల నడుమ పూజారులు, తలపతులు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి కంకవనాన్ని సేకరించి గద్దెపై ప్రతిష్టించారు. అనంతరం సాయంత్రం గ్రామ సమీపంలోని దేవునిగుట్టపై సారంగంలో కొలువై తల్లిని తీసుకువచ్చేందుకు చందా వంశీయులు, పూజారులు గుట్ట వద్దకు చేరుకున్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పూజారి సిద్దబోయిన చెలమయ్య తల్లిని తీసుకుని గుట్ట కిందకు రాగా గద్దెపైకి తీసుకువచ్చి ప్రతిష్టించారు.

శాంతినగర్‌లోని రెండిళ్లలో చోరీ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 13: పట్టణంలోని శాంతినగర్‌లో మంగళవారం రాత్రి దొంగలు రెండు ఇండ్లలో చోరీకి పాల్పడినట్లు ఆలస్యంగా తెలిసింది. బాధితుల కథనం ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన సారాబాయి సింగరేణి సంస్థలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. ఆమె ఇంటికి అతి సమీపంలోనే సారాబాయి కూతురు రజనీ, అల్లుడు రాజబాబు నివాసం ఉంటున్నారు. మూడు రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లా సొంత గ్రామమైన ఇల్లందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి సారాబాయి ఇంట్లో రెండు తులాల బంగారు అభరణాలు, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధిత మహిళ తెలిపారు. అదే విధంగా రజనీ ఇంట్లో కొన్ని విలువైన వస్తువులు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. ఇంటి పక్కన వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితులు బుధవారం ఇల్లందు నుంచి భూపాలపల్లికి చేరుకోగా ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతో దొంగలు పడినట్లు గుర్తించారు. అదే విధంగా శాంతినగర్ కాలనీలోని శనిగరపు రాజు, మంతెన రాజయ్య ఇండ్లలో కూడా తాళాలు పగలగొట్టి దొంగలు చోరీకి ప్రయత్నించారు. ప్రస్తుతం ఈ రెండు ఇండ్లలో ఎవరూ నివాసం ఉండడం లేదు.

బంగారం, నగదు చోరీ

టేకుమట్ల, ఫిబ్రవరి13 : మండలంలోని బూర్నపల్లిలో గురువారం దొంగలు పట్టపగలు తాళం పగలగొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ మొగిలి, భార్య లక్ష్మి తన కుమారుడితో కూతురి ఇంటికి గురువారం వెళ్లారు. మొగిలి శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం సమ యంలో ఇంటి తాళం పగలకొట్టి బీరువాలోని 7 తులాల బంగారం, రూ. 3లక్షల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన మొగిళి తాళం పగల కొట్టి ఉండడాన్ని గమనించి బీరువాలో చూడగా నగదు, బంగారం కనపడలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సుధాకర్ అక్కడికి చేరుకొని పరిశీలించి క్లూస్ టీంకు సమాచారం అందించారు.

ముద్దులగూడెంలో పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యంతో పోలీసులు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 13 : మండలంలోని ముద్దులగూడెం శివారులో అక్రమంగా లారీలో తరలిస్తున్న 300 క్వింటాళ్ల 60 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ముద్దులగూడెం శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల నుంచి గోవిందరావుపేట మండలంలోని ముద్దులగూడెం వైపుకు వస్తున్న లారీలో గోధుమరంగు బస్తాలు కనిపించడంతో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఆలూరి శ్రీను లారీలో పీడీఎస్ బియ్యాన్ని తెలంగాణకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. బియ్యం ఖమ్మం జిల్లా, మంగళగూడెంకు చెందిన నర్రా పెద్దులుకు చెందినవని, మహబూబాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఈ బియ్యాన్ని తక్కువ ధరకు కొని మహారాష్ట్రలోని నాగపూర్‌లో అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ ఒప్పుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.6లక్షల1200 ఉంటుందని ఎస్సై తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని లారీని సీజ్ చేసికేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గడ్డి మందు తాగిన యువకుడు మృతి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 13 : డాక్టర్ తిట్టడంతో గడ్డి మందు తాగిన గొర్లవేడు గ్రామానికి చెందిన సింగవేణి మహేశ్ గురువారం సాయంత్రం మృతిచెందాడు. బంధువుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం గొర్లవేడు గ్రామానికి చెందిన మహేష్ భూపాలపల్లి పట్టణంలోని సురక్ష ఆసుపత్రిలో వార్డుబాయ్, టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం వైద్యం విషయంలో డాక్టర్ రామ్ ప్రసాద్‌రెడ్డి మహేశ్‌ను డబ్బులు ఇవ్వాలని, లేకుంటే కేసు పెడతామని బెదిరించడంతో గడ్డి మందు తాగాడు. అతనిని వెంటనే సురక్ష ఆసుపత్రి తీసుకు వచ్చి ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం మృతి చెందాడు. మహేష్ మృతికి కారకుడైన డాక్టర్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని మృతుడి బంధువులు కోరుతున్నారు. డాక్టర్‌పై పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ కూడా ఇచ్చారు.

బాధిత కుటుంబాలకు శ్రీరామకృష్ణ ట్రస్టు చేయూత

మంగపేట, ఫిబ్రవరి 12 : మండలంలోని తిమ్మంపేటకు చెందిన గాందర్ల సమ్మక్క ఇల్లు ఇటీవల దగ్ధమై ఆస్తి నష్టం వాటిల్లగా, బాధిత కుటుంబానికి గురువారం శ్రీరామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిన నాగ రమేశ్ రూ.3వేలతో పాటు, బియ్యం పంపిణీ చేశారు. ఇదే గ్రామానికి చెందిన వలబోజు నర్సింహాచారి ఇటీవల మృతి చెందగా రూ.1500, బియ్యం పంపిణీ చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలు వనమాల కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ట్రస్టు సభ్యుడు బాడిష నవీన్, మునిగెల మహేశ్, స్థానికులు యగ్గడి అర్జున్, పూసల నర్సింహారావు, జాడి రాంబాబు, జిమడ నాగేశ్, దుర్గం నర్సింహారావు, దీగొండ బాబు, పూజారి సతీశ్, దుర్గం శ్రీను పాల్గొన్నారు.

బియ్యం, ఆర్థిక సాయం అందిస్తున్న నాగరమేశ్

ఇసుక రవాణాపై నిరంతర పర్యవేక్షణ : ఎస్పీ

మంగపేట, ఫిబ్రవరి 13 : నిబంధనలు ఉల్లంఘించి ఇసుక అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శబరీష్ అన్నారు. మండలంలోని రాజుపేట, కత్తిగూడెం ఇసుక క్వారీలను గురువారం ఆయన తనిఖీ చేశారు. క్వారీలో ఇసుక నిల్వలపై ఆరా తీశారు. ఆఫీసులోని రికార్డులను పరిశీలించారు. క్వారీలో పనిచేసే సిబ్బంది అక్రమాలకు పాల్పడినా, జీరో బిల్లులు, డబుల్ ట్రిప్, అదనపు లోడ్, నకిలీ వే బిల్లులు, తప్పుడు వాహనంలో రవాణా, తప్పుడు గమ్యం స్థానం లాంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నదులు, వాగుల్లో ఇసుక తవ్వకం అవకాశాలున్న జిల్లా పరిధిలోని అన్ని క్వారీల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఆయన వెంట ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, ఎస్సై టీవీఆర్ సూరి ఉన్నారు.

క్వింటా మిర్చికి రూ.25 వేలు చెల్లించాలి

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి 13 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి పంటను కొనుగోలు చేసి క్వింటాకు రూ.25 వేలు చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆలుబాకలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎకరానికి రెండు నుంచి మూడు లక్షల వరకు పెట్టుబడి పెడితే పంట విక్రయించే క్రమంలో సరైన మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు బీరెడ్డి సాంబశివ, గ్యానం వాసు, ఇరుప శ్రీను, రౌతు నర్సింహారావు, సోలం రంగయ్య, గంగినబోయిన కృష్ణ, కొరసా వీరవేణి, కృష్ణ, రాంబాబు, చంద్రరావు పాల్గొన్నారు.

కరెంట్ అమర్చిన వ్యక్తిపై కేసు నమోదు

ములుగురూరల్, ఫిబ్రవరి13 : అడవి పందుల నుంచి పంట రక్షణ కోసం పొలం చుట్టూ బైండింగ్ తీగలు అమర్చి కరెంట్ కనెక్షన్ ఇచ్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు గురువారం తెలిపారు. అబ్బాపురం గ్రామానికి చెందిన అదిగొప్పుల చంద్రమౌళి గాంధీనగర్ శివారులో ఉన్న తన పొలం చుట్టూ విద్యుత్ వైర్లను అమర్చినట్లు ఈ నెల 10న రాత్రి సమాచారం అందిందన్నారు. అక్కడికి చేరుకొని ఎలక్ట్రిషియన్ సాయంతో విద్యుత్ కనెక్షన్‌ను తొలగించినట్లు తెలిపారు. గ్రామాల్లో పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చవద్దని, అలా అమర్చిన వారి వివరాలను తెలియజేసిన వారికి రూ.5వేల నగదు బహుమతిని అందించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పులి జాడ కోసం ట్రాప్ కెమెరాల ఏర్పాటు

కాటారం, ఫిబ్రవరి 13 : పెద్దపులి జాడ కోసం కాటారం, మహదేవపూర్ రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను గురువారం అధికారులు అమర్చారు. పులి ఆచూకీ కోసం రెండు రోజులుగా అడవిలో గాలిస్తున్నా ఎలాంటి సమాచారం తెలియకపోవడంతో కెమెరాలను అమర్చినట్లు కాటారం ఎఫ్ఆర్వో స్వాతి తెలిపారు. పులి కదలికలు కనుగొనేందుకు నస్తూరుపల్లి అడవుల్లో మూడు ట్రాప్ కెమెరాలు, వీరాపూర్ అడవుల్లో ఒక కెమెరాను అమర్చామన్నారు. పెద్దపులి పాద ముద్రలు గుర్తించిన ప్రాంతంతో పాటు పలు చోట్ల కెమెరాలను అమర్చడం జరిగిందన్నారు. అడవులను గాలిస్తున్న బృందాల్లో కాటారం, మహదేవపూర్, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, రాజేశ్వర్, శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వోలు సుమన్, అశ్విన్, అటవీఅధికారులు సంజీవ్, అశోక్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

తల్లులను దర్శించుకుంటున్న భక్తులు

వరాల తల్లులకు మొక్కులు

అమ్మవార్ల మినీ జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి13: వరాలిచ్చే వనదేవతలు, ఆదివాసీ గిరిజన దైవాలు మేడారం సమ్మక్క-సారక్కలను భక్తులు నిండు మనసుతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మినీ జాతర రెండో రోజు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. చల్లని తల్లుల దీవెనలు కోసం బారులు తీరారు. వన దేవతలకు ఎత్తుబెల్లంతో పాటు చీరె, ఒడి బియ్యం, పసుపు, కుంకుమలు సమర్పించారు. అమ్మ వార్ల గద్దెలకు గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సుమారు 60 వేల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. కాగా, పూజారులు తెల్లవారుజామున జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని భక్తుల దర్శనాలను నిలిపివేసి రహస్య పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క పూజా మందిరానికి చేరుకుని అక్కడ దూపదీప నైవేద్యాలు సమర్పించారు. పూజారుల కుటుంబాలు, బంధువులు దేవతను దర్శించుకున్నారు.

రైతు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ములుగురూరల్, ఫిబ్రవరి 13 : తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు పద్మ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా గడ్డం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ అమ్జద్‌పాషా, ఉపాధ్యక్షుడిగా బండి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా బట్టి సంతోశ్, కోశాధికారిగా జక్కుల అయిలయ్య, సభ్యులుగా బండారి శ్రీనివాస్, ఎండీ నాసర్, వడి సారయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

ములుగురూరల్/ భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి13 : ఈ నెల 15 నుంచి ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్, భూపాలపల్లి జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి టీ శైలజ గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 14 సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ముగుస్తుందని చెప్పారు. 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభినున్నట్లు తెలిపారు. వివరాలకు 0870-2571192 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కోటగుళ్లలో పేరిణి నృత్య చిత్రీకరణ

గణపురం, ఫిబ్రవరి 13 : సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కోటగుళ్లలో గురువారం పేరిణి నృత్యాలను చిత్రీకరించారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు హరికృష్ణ సహకారంతో గురువు పేరిణి సందీప్ ఆధ్వర్యంలో 20 మంది కళాకారులు డైరెక్టర్ శ్రావణ్ విక్టరీ ఏపూరి పర్యవేక్షణలో 50 నిమిషాల నిడివితో చిత్రీకరించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా కోటగుళ్లను ఎంపిక చేసి నూతన అంశాలను ప్రాతిపదికగా పేరిణి ప్రాముఖ్యతను భావితరాలకు అందించేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేరిణి నృత్యం గురువు సందీప్ తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చిట్యాల, ఫిబ్రవరి 13 : పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఏవో తనిఖీలు చేపట్టారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు రసీదులు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. ఏఈవో రమన్ కుమార్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 13 : మండలకేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎల్ కార్తీక్ 65 శాతం, జే విజేందర్ 59 శాతం, బీ మురళీ, ఆర్ ఈశ్వర్ 56 శాతం, బీ మైఖేల్ 55 శాతం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో యూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ రాజు నాయక్, వైస్ ప్రిన్సిపాల్ బీ శ్రీరాములు, అధ్యాపకులు వీరన్న, గోపాల్‌రావు, జైపాల్, కుమారస్వామి, వంకర్, కృష్ణయ్య, కిరణ్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ములుగురూరల్, ఫిబ్రవరి 13 : ములుగు మండలం బండారుపల్లి ప్రభుత్వ పాఠశాలను దిశ ఫౌండేసన్ బృందం గురువారం సందర్శించింది. మండలానికి ఆరు ప్రాథమిక పాఠశాలల చొప్పున జిల్లాలో 54 పాఠశాలలను ఎంపిక చేసి ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ బోధనపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు ఐశ్వర్య, ప్రతిభ తెలిపారు. వారివెంట డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్లు అర్షం రాజు, గుల్లపెల్లి సాంబయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

వాజేడు, ఫిబ్రవరి 13 : మండలంలోని జంగాలపల్లి కేజీబీవీ బాలికల విద్యాలయంతో పాటు మినీ గురుకులం హాస్టల్‌లో గురువారం వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పిం చి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మినీ గురుకులంలో ఆహార నాణ్యతను పరిశీలించారు. ఎంఈవో తేజావత్ వెంకటేశ్వర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు, లకన్ పాల్గొన్నారు.

సాగు నీరు ఇవ్వాలని ఈఈకి వినతి

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 13 : బర్లగూడెం జీపీ పరిధిలో పంటలకు సాగు నీరు సకాలంలో అందించాలని కోరుతూ గురువారం ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహమూర్తి పాలెంవాగు ప్రాజెక్టు ఈఈ జగదీశ్‌కు మండలకేంద్రంలో వినతిపత్రం అందజేశారు. పాలెం వాగు ప్రాజెక్టు నీరు రాక మొక్క జొన్న పంట ఎండిపోయి అప్పుల భారం తట్టుకోలేక రైతు కచ్చులపు చందర్‌రావు ఆత్మహత్య చేసుకున్నాడని ఈఈకి వివరించారు. చందర్‌రావు ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ప్రధాన కాల్వలకు ఉన్న తూములకు గేట్లు లేక నీరు మొత్తం వృథా అవుతున్నదన్నారు. 30ఎకరాల విస్తీర్ణం ఉన్న చిరుతపల్లి చెరువు ప్రధాన కాలువ నుండి తూములు లేకపోవడం కారణంగా చెరువులోకి నీరు రావడంలేదని, నీరు వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. స్పందించిన ఈఈ మాట్లాడుతూ పిల్ల కాలువల పూడిక తీయడం తమ బాధ్యత కాదని, ఎంపీడీవోచే ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా తీయించుకోవాలని సూచించారు. బర్లగూడెం జీపీ ఆయకట్టుకు నీరు అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు ప్రవీణ్, మహేశ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 13 : సీజనల్ వ్యాధులపై ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి రాథోడ్ అన్నారు. గురువారం కాళేశ్వరం పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆరోగ్యశాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత, డీపీ కో ఆర్డినేటర్ మురళీధర్ రెడ్డి, ఎన్‌సీడీ టెక్నీషియన్ విజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

HOUSE FOR SALE
SepTeK
★ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime Schoolకు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666/8309035091
NTW-27793

CHANGE OF NAME
I, VALLEPU NAGARAJU S/o RAJAIAH, Age: 37Yrs, Occ: Driver, R/o H.No: 6-4/1, Vishwanatha Colony, Koppur Village, Bheemadevarapally Mdl, Hanumakonda Dist. My daughter name Changed from VALLEPU AMMULU D/o. VALLEPU NAGARAJU, to VALLEPU MEGHANA D/o. VALLEPU NAGARAJU, for all purposes.

CHANGE OF NAME
My Daughter GUNDE CHAMANTHY D/o. GUNDE BABU, R/o. H.No. 4-29, (V): Samudrala, (M): Ghanpur (Station), Dist: Jangaon-506252, T.G. Changed her name as GUNDE SRAVANTHI D/o. GUNDE BABU

CHANGE OF NAME
★I Danthalapelli Bikshapathi S/o Danthalapally Narayana resident of 9-8-38, Yellam Bazar, Warangal. H-No.: 9-8-38, -506002 Change my name from Danthalapally Bikshapathy to Danthalapelli Bikshapathi for all Purposes.
NTW-17483

CHANGE OF NAME
★I PESARU MADHAVI (New Name) Previously called MAREPALLI MADHAVI (old name) changed my Surname to PESARU MADHAVI and R/o H.No 24-3-399/29, Amity Homes, Vishnupriya Colony, Hanamkonda-506001. T.S., Solemnly declare.
NTW-17484

WANTED
jobs Apply Now!
★ Wanted PRO's / Agents for MBBS, B.Tech Abroad Admissions. Contact Immediately Cell: 8121554649
NTW-326594

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

GOLD FINANCE
★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565